

సోమశిలలో 10.149 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయానికి శుక్రవారం 5,926 క్యూసెక్కుల వంతున ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. దీంతో జలాశయంలో 10.149 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.72,570
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,517
3 శాతం జీఎస్టీతో	రూ.6,713
సవర (8 గ్రా)	రూ.53,704

గరిష్ఠం/కనిష్ఠం
34.1 /26.0

వాతావరణం

గాలిలో తేమ 66 శాతంగా శుక్రవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శనివారం తేమగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ అంశాలపై చర్చించారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నెల్లూరు (లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ న్యాయవాది ఒ. గవాస్కర్‌పై విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసుకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర్ రెడ్డి, సుందరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీసు వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ పోలీసు వెల్ఫేర్ డేను నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 62మంది సిబ్బంది ట్రాన్స్‌ఫర్లు, ఆరోగ్యభద్రత, రుణాలు, సస్పెన్షన్ తొలగింపు తదితర సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎస్పీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టీడీపీ నాయకుల దుశ్చర్య

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త నిర్మాణాలు ధ్వంసం



కూల్చివేసిన రేకుల షెడ్లు, చెట్లు

దుత్తలూరు: మండలంలోని నందిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మండ్ల వెంకటేశ్వర్లుకు చెందిన కట్టడాలను శుక్రవారం టీడీపీకి చెందిన కొంతమంది కూల్చివేశారు. ఇంటి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న గోడలు, గుడిసెలను, రేకులను, చెట్లను, అలాగే ఫెన్సింగ్ రాళ్లను తొలగించినట్లు బాధితుడు తెలిపారు. అలాగే 228–బీ1 సర్వే నంబరులో 12 సెంట్లలో నిర్మిస్తున్న కట్టడాలను కూల్చివేసినట్లు తెలిపాడు. ఈ సర్వే నంబరుపై ఉదయగిరి కోర్టులో ఇంజక్షన్ ఆర్డరు ఉన్నా కూడా బలవంతంగా తొలగించారన్నారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. అలాగే తన తండ్రి మండ్ల వెంకటసుబ్బయ్యపై దాడిచేయడంతో గాయాలు కాగా ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

నెల్లూరు(బారకాసు): బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎస్.పుగలేంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయినప్పటికీ చాలా మంది వినియోగదారులు ఇప్పటికీ తమ మొబైల్ సేవలను 2జీ, 3జీ సిమ్‌తో మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. వినియోగదారులు 4జీకి అప్‌గ్రేడ్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ ఉచిత సిమ్‌లను బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లలోనూ, బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు, రిటైలర్లు, ఏజెంట్ల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఒక్క నిమిషం ఆలోచిద్దాం

- అర్ధాంతరంగా ముగుస్తున్న జీవితాలు
- నెలరోజుల్లో 25 మందికిపైగా ఆత్మహత్యలు
- జిల్లాలో పెరుగుతున్న బలవన్మరణాలు



నెల్లూరు (క్రైమ్): కన్ను తెరిస్తే జననం... కన్ను మూస్తే మరణం.. రెప్పపాటే కదా జీవితం అన్నారు ఓ కవి. జీవిత ప్రయాణం ముగించే మరణం సహజంగా ఉంటేనే ఆ జీవితానికి సార్థకత. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక... చిన్నచిన్న సమస్యలకు కుంగిపోయి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో బంధాలను చిదిమేస్తున్నాయి. అయిన వారిని, కన్నవారిని పుట్టెడు దుఃఖంలోకి నెట్టేస్తున్నాయి. సమస్య ఏదైనా ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. అనుబంధాలు, ఆత్మీయతలను ఒక్కసారి గుర్తుచేసుకుని క్షణం పాటు ఆలోచిస్తే జీవితాన్ని జయించవచ్చు. నిండు నూరేళ్లు సంతోషంగా గడిపేయవచ్చు.

కుటుంబ సమస్యలనో... ఆర్థిక ఇబ్బందులనో... అనారోగ్యమనో... పరీక్షల్లో తప్పామనో... ప్రేమ విఫలమైందనో ఇలా రకరకాల కారణాలతో ఒత్తిడికి లోనై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. జీవితంలో ముందుకు వెళ్లే దారి తెలియక.. తోడుగా నిలబడే వారు లేక ఎంతో విలువైన జీవితానికి విషాదకర ముగింపు పలుకుతున్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉందన్న విషయాన్ని మరచి ఒత్తిడి కూపంలో నుంచి బయటపడలేక అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్నారు. మానసికంగా కుమిలిపోతున్న వారిని సకాలంలో గుర్తించకపోవడం, గుర్తించినా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ప్రధానంగా విద్యార్థులు, యువతపై తమ అభిప్రాయాలను తల్లిదండ్రులు బలవంతంగా రుద్దడం కూడా ఆత్మహత్యలకు కారణమవుతోందని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు యువత పరిపక్వత చెందని వయసులో సొంత నిర్ణయాలు తీసుకుని చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

నెలలో 25 మందికిపైగా..

నెల రోజుల వ్యవధిలో జిల్లాలో 25 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అధికశాతం మంది 15 నుంచి 35 ఏళ్లలోపు వారే ఉంటున్నట్లు తెలుస్తోంది. 50 ఏళ్ల పైబడిన వారిలోనూ ఈ ధోరణి అధికంగా ఉంటోందని మానసిక నిపుణులు చెబుతున్నారు. సమస్యలెదురైనప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతోనే అనర్థాలు జరుగుతున్నాయి. ఇందుకు జీవితం, సమస్యపై సరైన అవగాహన లేకపోవడమే కారణం. మనిషి జీవితంలో సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు సహజం. సంతోషంలో పొంగిపోవడం, దుఃఖంలో కుంగిపోవడం తగదు. రెండింటిని సమానంగా స్వీకరించినప్పుడే ఒడిదుడుకులు ఎదురైతే ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనవచ్చు. మనం విఫలమైతే సమాజమేమి వెలివేయదు. ఉన్నతంగా ఎదిగేందుకు మరో అవకాశం ఇస్తుందన్న విషయాన్ని గుర్తించాలి.

ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం..

ఒక్కప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఎవరికైనా సమస్య వస్తే పెద్దలు ఓదార్చి క్షణాల్లో ఆ సమస్యను పరిష్కరించేవారు. మేమున్నామని ధైర్యాన్ని భరోసాను ఇచ్చేవారు. కాలంతో పాటు మానవ సంబంధాలూ మారుతున్నాయి. పరుగుల ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, మారుతున్న ఆలోచనా విధానాలు కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోలేనంతగా మారిపోతున్నాయి. ఇప్పటి తరంలో సున్నిత మనస్తత్వం ప్రబలుతోంది. చిన్న సమస్యలకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతున్నారు.

చావే పరిష్కారం కాదు



మానవ జీవితంలో ఒడిదొడుకులు సహజం. క్షణికావేశంలో నిర్ణయాలు తగదు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్య వచ్చినా ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది. జీవితం ఎంతో విలువైనది. ధైర్యంగా ముందుకు సాగాలి. చనిపోయి సాధించేదేమీ లేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం ఆనందంగా ఉంటుంది. – డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

మానసిక లక్షణాలు

ఆత్మహత్యకు పాల్పడేవారిని ముందే గుర్తించవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారు కొన్ని అసాధారణ లక్షణాలను కలిగి ఉంటారు. ఒంటరి తనాన్ని కోరుకుంటారు. అతిగా మద్యం తాగుతారు. ప్రతీకారం తీర్చుకోవడం గురించి ఎక్కువగా మాట్లాడుతుంటారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవడం, అతిగా నిద్రపోవడం, రాత్రిపూట నిద్రపోకుండా ఎక్కువగా ఆలోచించడం, అసలు దేనికీ స్పందించకపోవడం, చనిపోతున్నట్లు ముందుగానే పరోక్షంగా సంకేతాలు ఇవ్వడం లాంటివి చేస్తుంటారు.

ఇలా చేయాలి...

- ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచరాదు. వీలైనంతవరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచి కుటుంబ సభ్యులంతా వారిలో ధైర్యం నింపాలి.
- వీలైనంత వరకు ఆత్మహత్య భావన ఉన్నవారికి ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి
- ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింక్ పుస్తకాలు, బిహేవియర్ థెరపీ, కౌన్సెలింగ్ ప్రక్రియలు శక్తివంతంగా ఉపయోగపడుతాయి.
- వీలైతే మానసిక వైద్యనిపుణులచే కౌన్సెలింగ్ ఇప్పించాలి

చట్టం ఇలా...

ఆత్మహత్యకు పాల్పడడం, యత్నించడం, అందుకు ప్రోత్సహించడం చట్టప్రకారం నేరం. ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిపై భారత న్యాయ్‌సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 226 కింద, ఆత్మహత్యకు ప్రోత్సహించే వారిపై సెక్షన్ 108 కింద కేసు నమోదు చేస్తారు.

ఇటీవలి బలవన్మరణాలు..



పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాసులు(ఫైల్)

- భగత్‌సింగ్‌కాలనీలో ఆర్థిక ఇబ్బందులతో ఫయాజ్(25) బలవన్మరణం..
- కుటుంబ కలహాల నేపథ్యంలో వరికుంటపాడు మండలం విరువూరుకు చెందిన ఎం.ప్రసాద్‌రెడ్డి(40)..
- తరగతి గదిలో ఉపాధ్యాయుడు కొట్టాడని మనస్తాపంతో జయధర్(15)..
- మనుబోలులో ఎంతకీ ఆరోగ్యం కుదుటపడక పోవడంతో వివాహిత శాంతి(35)..
- చదువుకోలేదని తల్లి మందలించడంతో డేవిడ్‌రాజ్(13) ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పెన్నానదిలో దూకి శ్రీనివాసులు(40)..
- వివాహం కావడం లేదని కావలిలో శ్రీనివాసులు(32)....

ఆటో కార్మికుల ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

- లైసెన్స్ ఆధారంగా వాహనమిత్ర అమలు చేయాలని డిమాండ్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఆటో కార్మికులకు బ్యాడ్జిలతో సంబంధం లేకుండా లైసెన్స్‌లను పరిగణనలోకి తీసుకుని వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు నగరంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నవాబుపేటలోని బీవీఎస్ స్కూల్ నుంచి ఏబీఎం కాంపౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని బ్యాడ్జిలతో సంబంధం లేకుండా ఆటో డ్రైవర్లు అందరికీ వర్తింపజేయాలని, ఆటో డ్రైవర్లకు ఉరితాడుగా ఉన్న హిట్ అండ్ రన్ చట్టం 106(1,2) తోపాటు అధిక రుసుం వసూలు చేసే జీఓ నంబరు 21ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సురేష్, నగర కార్యదర్శి మురళి, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు రాంబాబు, నరసింహ, నివాస్, రాజా, నాగేశ్వరరావు, దయాసాగర్, వాసు, అంకయ్య, సుబ్బారెడ్డి, రమేష్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పల్మనాలజిస్టుల కాన్ఫరెన్స్

నెల్లూరు(అర్బన్): శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి ఆధునిక చికిత్సా విధానాలపై డాక్టర్లు, వైద్యవిద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పిట్టి మల్లికార్జునరావు సూచించారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాల్లో పల్మనాలజిస్టులకు ఆధునిక చికిత్సలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జరిగింది. డాక్టర్ పిట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ 15 ఏళ్ల తర్వాత నెల్లూరులో శని, ఆదివారాల్లో మాగుంట లేఅవుట్‌లోని అనిల్ గార్డెన్స్‌లో పల్మనాలజిస్టుల సైంటిఫిక్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. వైద్య విద్యార్థులు, డాక్టర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసోసియేషన్ నాయకులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ మౌర్య, డాక్టర్ ప్రేమ్‌దీప్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి తెలుగు వైభవ పురస్కారం రేపు

ఆత్మకూరురూరల్: భారతరక్షణ శాస్త్రవేత్త, మాజీ డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డికి ఈ నెల 4న అవనిగడ్డలో మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.శ్రీనివాసులు తెలిపారు.

అవినీతిలో సోమిరెడ్డికి ఫస్ట్ ర్యాంకు

- నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుక దోపిడీ
- ఎమ్మెల్యే కుమారుడిదీ అదే బాట
- అడ్డుకుంటున్న ప్రజలపై కేసులు పెడుతున్నారు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఇసుక దోపిడీ ఫొటోలు చూపుతున్న కాకాణి

నెల్లూరు (బారకాసు): సూరాయపాళెంలో టీడీపీ నేతలు రూ.100 కోట్ల విలువైన ఇసుక రీచ్‌ను కొట్టేయడానికి స్కెచ్ వేశారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఇదే అంశంపై సంతకాలు చేయాలని టీడీపీ నేతలు అధికారులను బెదిరిస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వాటన్నింటి మీద సీఎం చంద్రబాబు విచారణ చేపట్టాలన్నారు. సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉచిత ఇసుకను ఇస్తామని ప్రభుత్వం పదే పదే చెబుతోందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం టీడీపీ హయాంలో ఇసుక సరఫరా విషయంలో వినియోగదారుడిపైన పెనుభారం పడుతూ ప్రభుత్వాదాయానికి గండి కొట్టడం జరుగుతోందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి అక్రమాలను పక్కా ఆధారాలతో తాను చూపిస్తున్నానని కాకాణి వెల్లడించారు. సోమిరెడ్డి అత్యంత అవినీతి పరుడని అనేక సందర్భాల్లో చెప్పానని ఇప్పుడు కూడా చెబుతున్నానన్నారు. చంద్రబాబు ర్యాంకులు ప్రకటిస్తే మాత్రం అవినీతిలో సోమిరెడ్డికి మొదటి ర్యాంకు వస్తుందన్నారు. పొదలకూరు మండలం విరువూరు ఇసుకరీచ్‌లో రాత్రిపగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను స్థానిక పచ్చనేతలు దోచుకుంటున్నారని అన్నారు. నిత్యం 50 నుంచి 60 టిప్పర్లు ఇసుకను దోపిడీ చేస్తున్నారన్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుకను దోచేస్తున్నా అధికారులు మౌనం వహిస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిని నేరుగా ట్రాక్టర్లతో తొక్కించాలనుకోవడం.. వీలుకాని పక్షంలో ఇసుక లోడుతో ఉన్న ట్రక్‌ను అక్కడే వదిలేసి ఇంజన్లను తీసుకెళ్లిపోవడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని బెదిరిస్తున్నారన్నారు.

మత్స్యకారులకు సాయమేది చంద్రన్నా?

- చేపల వేట విరామ సమయం గడిచిపోయినా ఆ ఊసే లేదు
- ఎన్నికల సమయంలో కుటుంబానికి రూ.20 వేలు ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటినా పట్టించుకోని వైనం
- ఆశగా ఎదురుచూస్తున్న 12,444 మత్స్యకార కుటుంబాలు



సముద్ర తీరంలో మత్స్యకారుల వేట సామగ్రి

కావలి: సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే కాలమైన ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల వేట నిషేధ కాలంలో జిల్లాలోని మత్స్యకారులకు అందించే ప్రభుత్వ ఆర్థిక సహాయం ఒకటిన్నర నెల దాటినా ప్రభుత్వం నుంచి దాని ఊసే లేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చివరి ఏడాదిలో అంటే 2019లో 15,050 మందికి చేపలు వేట విరామ ఆర్థిక సహాయాయం ఇవ్వకపోయినా.. అనంతరం అధికారంలోకి వచ్చిన వైస్ జగన్ ఇచ్చారు. అనంతరం వరుసగా 2020లో 10,112 మందికి, 2021లో 10,235 మందికి, 2022లో 10,689 మందికి, 2023లో 12,072 మందికి ఇచ్చారు. ఈ ఏడాది (2024) చేపల వేట విరామ సమయం అమల్లో ఉండగానే ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారులు జిల్లాలో 12,444 మందికి వేట విరామ ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. మత్స్యశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు సముద్ర తీరం ప్రాంతంలో ఉండే ప్రతి ఇంటింటికి సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుంది. ఆ విధంగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలను సేకరించి అర్హులైన వారికి ప్రతి ఏటా వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు అందించింది.

గడిచిన ఐదేళ్లూ.. ఠంచన్‌గా..

2019, 2020, 2021, 2022, 2023 సంవత్సరాలకు ఏడాదికి రూ.10,000 చొప్పున మత్స్యకారుల వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేశారు. జిల్లాలో నిసముద్ర తీరం వెంబడి నివసిస్తున్న మత్స్యకారులకు చేపల వేట చేయడమే వృత్తి. 21–60 ఏళ్ల లోపు కలిగి, ఒక కుటుంబంగా ఉన్న మత్స్యకారుడై ఉండి, ప్రభుత్వం నుంచి ప్రతి నెలా ఇతర పింఛన్లు ఏవీ తీసుకోకుండా ఉన్న మత్స్యకారులను గుర్తించి వైఎస్సార్ మత్సకార భరోసా కింద ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుండేది. కేవలం చేపల వేట లేకపోవడంతో మత్స్యకారుల కుటుంబాల అవసరాల నిమిత్తం ప్రభుత్వం అర్హులైన వారికి నగదును అందజేసింది. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అర్హులైన మత్స్యకారులకు రూ.4,000 ఇస్తామని చెప్పి, కొందరికి మాత్రమే ఇస్తుండేవారు. మిగిలిన వారికి మొండి చేయి చూపేవారు. కాని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్ అనే ఉద్యోగిని నియమించడం ద్వారా, మత్స్యకారులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదవుతోంది. దీంతో మరింత మంది మత్స్యకారులకు ఎటువంటి సిఫారసులు లేకుండానే, అర్హతలనే ప్రామాణికంగా వైఎస్సార్ మత్స్యకార భరోసా ఆర్థిక సహాయం అందింది. దీంతో మత్స్యకారులు సంతోషంగా ఉండేవారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం జూన్ 12న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు మత్స్యకారులకు నయా పైసా ఆర్థిక సహాయం చేయలేదు. ఎన్నికల్లో చంద్రబాబు మత్స్యకారులకు చేపల వేట నిషేధ ఆర్థిక సహాయం కింద ఒక్కొక్కరికి రూ.20,000 ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు జిల్లాలో అర్హులుగా అధికారులు సిద్ధం చేసిన 12,444 మందికి ప్రభుత్వం రూ.24.88 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇంతవరకు పట్టించుకోలేదు.

పాత బకాయిలనూ చెల్లించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం

రాష్ట్రం విడిపోయిన తర్వాత మొట్ట మొదటిసారి 2014–19 కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులను నామమాత్రంగానే ఆదుకుంది. చంద్రబాబు ప్రభుత్వం తొలి ఏడాది 2014–15, రెండవ ఏడాది 2015–16 లలో రూ.2,000 మాత్రమే ఇచ్చింది. తర్వాత మూడో ఏడాది 2016–17, నాలుగో ఏడాది 2017–18 లలో రూ.4,000 ఇచ్చింది. ఐదో ఏడాది ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వం నాలుగు ఏళ్ల పాలనలో మత్స్యకారులకు చేసిన ఆర్థిక సహాయం స్వల్పం కావడం గమనార్హం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఒక్కొక్కరికి రూ.10,000 వంతున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకుని, టీడీపీ ప్రభుత్వం ఇవ్వకుండా ఎగ్గొట్టిన 2019 బకాయిల చెల్లింపుతోనే వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ను ప్రారంభించారు.

కష్టాల్లో ఉన్నాం, ఆదుకోవాలి



సముద్రంలో తమిళనాడు జాలర్లు భారీ బోట్లతో వచ్చి మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. దీంతో మాకు వేటకు వెళితే వలలకు చేపలు పడటం లేదు. కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. అలాగే డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదు. సముద్రంపై చేపల వేటను నమ్ముకొని బతుకుతున్న మత్స్యకారులు కుటుంబాలు జరుగుబాటు లేక కష్టాల్లో ఉన్నాయి. చంద్రబాబు చేపలు వేట విరామ సమయానికి సంబంధించి ఆర్థిక సహాయం రూ.20,000 ఇస్తానని చెప్పారు. మత్స్యకారులకు ఆ సాయం అందించి ఆదుకోవాలి.

– కొమరి రాజు, మత్స్యకార నాయకుడు, కావలి

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40

ఎన్‌హెచ్‌పై 'చిల్లర' కొట్టుడు

జాతీయ రహదారిపై 'చిల్లర' కొట్టుడుకు విజనరీ బాబు మాస్టర్ ప్లాన్ వేశారు. కుంతీ పుత్రుడికి తండ్రి తానే అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' సంస్థ నిధులతో నిర్మించిన రోడ్డుపై టోల్ గేట్లు పెట్టుకుని ఖజానా నింపుకునేందుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల సంస్థకు అప్పగించడంతో అభివృద్ధి జరుగుతున్నాయి. ఇప్పుడు ఆ రోడ్లపై టోల్‌గేట్ల పేరుతో పార్టీ నేతలకు దోచిపెట్టేందుకు ప్రజలపై టోల్ భారం వేయడానికి ప్రణాళిక రచించారు.

- వైఎస్ జగన్ హయాంలో రూ.424 కోట్లతో నిర్మించిన రోడ్లపై 'టోల్' గేట్లు
- కేంద్రం నిధులతో నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణం
- టోల్‌గేట్లతో ఖజానా నింపుకునేందుకు విజనరీ 'మాస్టర్' ప్లాన్



కావలి- సీతారామపురం రోడ్డు

కావలి: 'సంపద సృష్టించడం' కంటే.. సృష్టించిన సంపదను కొల్లగొట్టడం ఎలాగో తెలిసిన మాస్టర్ ప్లానర్, విజనరీ చంద్రబాబు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సింగిల్, డబుల్ రోడ్లుగా ఉన్న రాష్ట్రీయ రహదారులకు జాతీయ రహదారుల హోదా కల్పించడంతో పాటు నాలుగులేన్ల రహదారులుగా విస్తరించి నిర్మించారు. అందులో ఒకటి కావలి– సీతారామపురం ఎన్‌హెచ్ 167 బీజీ రహదారి. 104.3 కి.మీ. ఈ రహదారిని రూ.424 కోట్లతో వ్యయంతో 'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' సంస్థ నిధులతో నిర్మాణం చివరి దశలో ఉంది. ఇలాంటి రహదారుల్లో టోల్‌గేట్లు పెట్టి టోల్‌చార్జీలు వసూలు చేయాలని చంద్రబాబు నిర్ణయించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పూర్తకానున్న రోడ్లపై టోల్‌గేట్లా!

గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించి నిర్మాణాలు చివరి దశలో ఉండగా వాటి అభివృద్ధి పేరుతో టోల్‌గేట్ల ద్వారా దోచుకునే పన్నాగం పన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లు.. రోడ్లు బాగు చేయలేదంటూ చంద్రబాబు దుష్ప్రచారం చేశారు. మరి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రోడ్ల అభివృద్ధికి నిధులు లేవలంటూ పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో రోడ్లను అభివృద్ధి చేస్తామంటూ జనం చెవిలో పూలు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే రోడ్లను అభివృద్ధి చేసే పనులను కాంట్రాక్టర్లకు అప్పగించి, ఆ రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాల నుంచి టోల్ వసూలు చేసుకునేలా సదరు కాంట్రాక్టర్లకు అధికారం అప్పగించాలని చంద్రబాబు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో 27 రోడ్లను గుర్తించింది. ఆ జాబితాలో 18వ ఐటమ్‌గా కావలి–సీతారామపురం రోడ్డు కూడా ఉండటం గమనార్హం. కావలి నుంచి దుత్తలూరు వరకు మాత్రమే ఈ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దుత్తలూరు, వరికుంటపాడు మీదుగా ఇప్పటికే ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారి ఉంది. అక్కడి నుంచి వాహనాలు అటు రాయలసీయ, ఇటు ప్రకాశం, గుంటూరు, తెలంగాణలోని నల్గొండ, హైదరాబాద్‌లకు వెళ్లిపోతుంటాయి. ఈ రోడ్డుపై రోజుకు 7,500 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని అంచనా. ఇక ఈ రోడ్డు వెంబడే ఉన్న గ్రామాలు, రోడ్డు ఆధారంగా ఉన్న గ్రామాలు కనీసం 1,500 వరకు ఉన్నాయి. ఈ ప్రాంతాలకు చెందిన వారితో పాటు ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల వారు కూడా ఈ రోడ్డు పై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అందుకే కావలి-దుత్తలూరు నడుమ ఉన్న 80 కి.మీ. మాత్రమే పొందుపరిచి.. ఈ రోడ్డులోనే టోల్‌గేట్లు పెట్టి వసూలు చేయాలని నిర్ణయించింది.



చంద్రబాబు ప్రభుత్వం టోల్ వసూలు చేసే రోడ్ల జాబితాలో ఉన్న కావలి-సీతారామపురం రోడ్డు

జాతీయ రహదారిని.. రాష్ట్ర హైవేగా చెప్పి..

కావలి–దుత్తలూరు– సీతారామపురం ఆర్‌అండ్‌బీ శాఖ డబుల్ రహదారిగా ఉండేది. 104.3 కి.మీ ఈ రోడ్డును 'ఎక్స్‌ప్రెస్ హైవే'గా అభివృద్ధి చేసేందుకు ఫిబ్రవరి 2020లో అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కింద ఉండే జాతీయ రహదారుల సంస్థకు అప్పగించింది. ఈ రోడ్డు నెల్లూరు జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలకు, వైఎస్సార్, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు అనుసంధానం చేస్తోంది. విజయవాడలోని కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ బ్రిడ్జిని 2020 అక్టోబర్ 16వ తేదీన అప్పటి కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అప్పటి సీఎం వైఎస్ జగన్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కావలి–సీతారామపురం రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని వైఎస్ జగన్ విజ్ఞప్తికి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఆ మేరకు జాతీయ రహదారుల సంస్థ సత్వర చర్యలకు ఉపక్రమించింది. కావలి –సీతారామపురం రోడ్డుకు ఎన్‌హెచ్ 167 బీజీ నంబరు కేటాయించింది. రూ.424 కోట్లతో ఈ రోడ్డును నాలుగు లైన్లగా అభివృద్ధి చేసే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారిగా మార్చేసిన తర్వాత, జాతీయ రహదారుల సంస్థ నిధులు మంజూరు చేసి నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తుంటే, చంద్రబాబు ప్రభుత్వం ఈ రోడ్డును అభివృద్ధి చేసి వాహనాల నుంచి టోల్ వసూలు చేసే జాబితాలో చేర్చడం విస్మయ పరిచింది. ఇది ఎలా సాధ్యమవుతోందని సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది.



కావలి-సీతారామపురం రోడ్డుకు జాతీయ రహదారుల సంస్థ కేటాయించిన నంబరు

ఇదేందయ్యా.. ఇంత అన్యాయమా?



గత ప్రభుత్వంలో రెండేళ్ల క్రితమే కావలి–సీతారామపురం రోడ్డును నాలుగు రోడ్లుగా విస్తరణ చేసే అభివృద్ధి పనులు చేస్తుంది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం చేసే అభివృద్ధి ఏమిటో అర్థం కావడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం ఈ రోడ్డులో టోల్ గేట్ ఏర్పాటు చేయడమేమిటో విస్మయపరుస్తుంది. ఏమీ అర్థం కావడం లేదు. ఇది జాతీయ రహదారి. కేంద్రం నిధులతో నిర్మిస్తోంది. తాను అభివృద్ధి చేస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్నాడు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలి.

– రాధాకృష్ణారెడ్డి, కలిగిరి

కొత్తగా.. వింతగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బీ శాఖ ద్వారా రోడ్లు నిర్మించడం ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. అయితే ఈ రోడ్లపై తిరిగే వాహనాలు టోల్‌గేట్ చెల్లించినట్లుగా ఎప్పుడూ వినలేదు. అసలు ఈ రోడ్డు జాతీయ రహదారిగా మారింది. చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వానికి ఏం సంబంధం. బాధ్యతగా పూర్తి చేసే వరకే రాష్ట్ర ప్రభుత్వానిది. చంద్రబాబు ప్రభుత్వం ఈ రోడ్లపై తిరిగే వాహనాలు నుంచి టోల్ వసూలు చేయాలని సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలియడంతో ఆశ్చర్యం వేసింది. కొత్తగా వింతగా ఉంది. **హజరత్, నాగిరెడ్డిపాళెం, కలిగిరి**

జెడ్పీలో పలువురికి పదోన్నతులు

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఇద్దరు సీనియర్ సహాయకులు, ఒక వీడీఓ గ్రేడ్–1 పరిపాలన అధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంకటగిరి ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న కె లక్ష్మీనరసింహంను ఏఓగా, జిల్లా డ్వామా కార్యాలయంలో సీనియర్ సహాయకుడు షేక్ అబ్దుల్ రజాక్‌ను జెడ్పీ ఏఓగా, బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగు గ్రేడ్–1 వీడీఓ వీ రామ్మోహన్‌రావును చిల్లకూరు ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా పదోన్నతులు కల్పించి బదిలీ చేశారు. శుక్రవారం జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ కె కన్నమనాయుడు వారికి పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి చిరంజీవి, పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగ సంఘ నేత లక్కాకుల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

పౌల్ట్రీ

అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.110
లేయర్	రూ.90
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.230
లేయర్ చికెన్:	రూ.153

ప్రయాణికులకు మెరుగైన బస్సు రవాణా సౌకర్యం

- జిల్లా పీటీడీ జాయింట్ కమిషనర్ జి.విజయరత్నం

ఆత్మకూరురూరల్: నెల్లూరు రీజియన్‌లోని ఏడు ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికులకు మరింత మెరుగైన బస్సు సౌకర్యాలతో పాటు సంస్థలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాశాఖ జాయింట్ కమిషనర్ జి.విజయరత్నం అన్నారు. ఆత్మకూరులోని ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజియన్ పరిధిలో 600 షెడ్యూల్ బస్సులు నడుస్తున్నాయన్నారు. కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు నిబద్ధతతో పని చేయబట్టి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కార్పొరేషన్‌గా ఉన్న ఆర్టీసీ కార్మికులను, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చడం సంస్థ చరిత్రలో గొప్ప విజయమన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నెల్లూరు నుంచి రాయలసీమ జిల్లాల వైపు రాత్రి వేళల్లో వెళ్లే బస్సులు ఆత్మకూరు డిపో వరకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరుపాళెం సెంటర్ జాతీయ రహదారి వద్ద నాలుగు రోడ్ల కూడలిలో బస్సు షెల్టర్ లేక నిత్యం వేలాది మంది ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను విలేకరులు ఆయన దృష్టికి తేగా, రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు డిపో పరిధిలోని డార్మెంటరీ, తాగునీటి సౌకర్యాలు, బస్సు గ్యారేజీలో వివిధ విభాగాల పని తీరు, బస్సుల కండీషన్, తదితరాలను సమగ్రంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆత్మకూరు డిపో మేనేజరు షేక్ కరీముల్లా, అసిస్టెంట్ మేనేజరు కల్పన, నెల్లూరు ప్రాంతీయ కార్యాలయం సీఐ చెంచులక్ష్మి, ఎంఎఫ్ హనుమంతరెడ్డి, ఆత్మకూరు ఏఎంఎఫ్ఓ బాబురావు, డిపో హెచ్‌సీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజారవాణా అధికారిని, పలువురు కార్మికులు, సిబ్బంది శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు.



ఆర్టీసీ గ్యారేజీలో తనిఖీలు చేస్తున్న ప్రజా రవాణా అధికారి జి విజయరత్నం

న్యాయవాదులకు నూతన చట్టాలపై అవగాహన నేడు

నెల్లూరు (లీగల్): ఏపీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు న్యాయవాదులకు నూతన క్రిమినల్ చట్టాలపై బార్ అసోసియేషన్ హాల్లో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయమూర్తులు పినపాటి భరద్వాజ, పాలమంగళం వినోద్ నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో న్యాయవాదులు తప్పక హాజరు కావాలని కోరారు.

606 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 606 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 650 బేళ్లు రాగా, అందులో 606 బేళ్లను విక్రయించినట్లు చెప్పారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.358, కనిష్టంగా రూ.205, సగటున రూ.281.78 ధర పలికిందని వివరించారు. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

అన్నను కడతేర్చిన తమ్ముడు

- క్షణికావేశంలో దాడిగా పోలీసుల నిర్ధారణ

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు తిప్పరాజువారివీధికి చెందిన బి.రాజేష్ (34)ది అనుమానాస్పద మృతి కాదని హత్యేనని పోలీసుల విచారణలో వెల్లడైంది. సొంత తమ్ముడే అన్నను కడతేర్చారని తేలింది. పోలీసుల సమాచారం మేరకు.. తిప్పరాజువారి వీధికి చెందిన బి. చంద్ర, ముత్యాలు దంపతులకు రాజేష్ (34), ఈశ్వర్ కుమారులు. ఈశ్వర్ కరెంట్ పనులు చేస్తుండగా రాజేష్ మద్యానికి బానిసై నిత్యం మద్యం మత్తులో ఉండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాజేష్ తలపై తీవ్రగాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను విచారించగా మద్యం తాగి తానే గాయాలు చేసుకున్నాడని పోలీసులకు వెల్లడించారు. అయితే వారి మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పోలీసులు వారిని తమదైన శైలిలో విచారించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడు, నిందితుడు ఇద్దరూ కుమారులే కావడంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది. పెద్ద కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోగా చిన్న కుమారుడు జైలుకు వెళ్లనున్నాడు.

క్షణికావేశంలో..

రాజేష్ గురువారం పూటుగా మద్యం తాగి ఇంట్లో ఉన్నాడు. మధ్యాహ్నం ఈశ్వర్ భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాడు. అతను భోజనం చేస్తుండగా రాజేష్ హోమ్ థియేటర్‌లో సౌండ్ పెంచి పాటలు వినసాగాడు. సౌండ్ తగ్గించమని ఈశ్వర్ ప్రాధేయపడినా పట్టించుకోలేదు. దీంతో అన్నదమ్ముల నడుమ వివాదం చెలరేగింది. కోపోద్రిక్తుడైన ఈశ్వర్ వంట ఇంట్లోకి వెళ్లి చపాతి కర్ర, కత్తితో తీసుకుని వచ్చి అన్నపై విచక్షణా రహితంగా దాడి చేశారు. తల్లిదండ్రులు అడ్డుపోయినా పట్టించుకోలేదు. తలపై తీవ్రగాయాలై రక్తస్రావంతో అపస్మారక స్థితిలో పడి ఉన్న రాజేష్‌ను తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజేష్ మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి జీజీహెచ్ వైద్యులు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ సంరక్షణ చర్యలు చేపట్టాలి

- సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అటవీ సంరక్షణకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా అటవీశాఖ కార్యాలయంలో రేంజర్లు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అటవీ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెద్ద సంఖ్యలో నాటాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కింద జిల్లాలో ఇచ్చిన టార్గెట్ మేరకు మొక్కలు నాటి కాపాడాలన్నారు. తీర ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. కోర్టు కేసులున్న చోట కౌంటర్ అఫిడవిట్‌లు వేసి త్వరిత గతిన కేసులు క్లియర్ అయ్యేలా చూడాలన్నారు. నెల్లూరు పట్టణానికి దగ్గరలో ఉన్న నగరవనం అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అటవీ వాతావరణాన్ని దగ్గరకు చేర్చాలన్నారు. నగర వనంలో వాకింగ్ ట్రాక్, పచ్చిక పనులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. పిల్లల కోసం ఆట వస్తువులన్ని అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. జిల్లాలో వన్యప్రాణుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలన్నారు. రాపూరు, వెలిగొండ, పెంచలకోన, ఉదయగిరి అడవులపై ప్రత్యేక దృష్టి సారించి చందనం చెట్లను సంరక్షించాలన్నారు. అటవీ ప్రాంతంలో పెద్దపులి గురించి ఆరా తీశారు. అధికారుల పనితీరు మరింతగా మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. జామాయిల్ చెట్ల పెంపకం, వాటి కోత తదితర విషయాలను చర్చించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ చంద్రశేఖర్, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, ఇతర డివిజన్ల రేంజర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి